
నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 బుధవారం 31 జూలై 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY


## నాకు రుణమాఫీ కాలే



నర్సింహులపేట, జూలై 30 : నేను డీసీసీ బ్యాంకులో రూ.70వేలు పంట రుణం తీసుకున్నా. కానీ నా పేరున మూడు అకౌంట్లు ఉన్నట్లు ఆధార్ నంబర్ నమోదు చేయడంతో నా పేరున మొత్తం రూ.2,11,912 అప్పు ఉన్నట్లు చూపిస్తున్నది. నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. నేను తీసుకున్న రూ.70 వేలు మాఫీ కాలేదు. రేపు మాపు అని తిప్పుతున్నరు. రైతు సమాచార పత్రంలో మూడు అకౌంట్లు ఉన్నట్లు రూ.2.11 లక్షల అప్పు ఉన్నట్లు చూపిస్తొంది. బ్యాంకు వాళ్లు మాత్రం రూ.71,779 ఉందని అవి మాఫీ కాలేదని చెబుతున్నారు. గీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడుతలు మాఫీ చేసినా నా రుణం మాత్రం మాఫీ కాలేదు.

– కొండ వెంకన్న, దాట్ల








- రైతుల సందేహాలకు నివృత్తి ఎక్కడ
- మొదలైన రెండో దశ మాఫీ ప్రక్రియ
- మొదటి దశ కోసమే ఇంకా ఎదురుచూపులు

# రెండో దశ.. అదే నిరాశ

## రుణమాఫీ అమలుపై అయోమయం

*అయోమయం, గందరగోళం, అనుమానం, సందేహం.. రుణమాఫీ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి మెజార్టీ రైతులది ఇదే పరిస్థితి. అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా గొప్పలు చెబుతున్నా అమలు తీరు మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికే మొదటి విడుత రూ.లక్ష లోపు మాఫీకే నోచుకోక ఎంతోమంది అన్నదాతలు ఆగమవుతుంటే తాజాగా మంగళవారం ప్రారంభమైన రెండో విడుతపైనా అదే అస్పష్టత నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండగా మాఫీ మొత్తాన్ని తగ్గించేలా రేవంత్ సర్కారు నిబంధనలు విధించడం, వివరాల సేకరణలో క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మాఫీ అయినట్లు ప్రభుత్వం నుంచి కచ్చితమైన సమాచారం లేక బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్న రైతులు.. ఇక చివరి జాబితాలోనైనా పేరుండక పోతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.*

*- వరంగల్, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

వరంగల్, జూలై 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ ప్రక్రియపై రైతుల్లో అదే అయోమయం కొనసాగుతున్నది. తొలి దశలో లక్ష రూపాయల లోపు పంట రుణాలను మాఫీ చేశామని, రెండో దశ మాఫీ ప్రక్రియను మొదలు పెడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. రెండో దశలో లక్షన్నర రూపాయల్లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నది. మాఫీపై రైతుల్లో మాత్రం ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి దశలో 25,391మంది రైతులకు చెందిన రూ.141.95 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది. రెండో దశలో 14,700 మంది రైతులకు చెందిన రూ.143.83 కోట్ల పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో చాలామంది ఈ పథకానికి దూరమయ్యారు. పంట రుణాల మాఫీ మొత్తాన్ని తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు విధించడం, క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం వివరాలు సేకరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య బాగా తగ్గింది. పంట రుణాల మాఫీపై రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు బాగా అంతరం కనిపిస్తున్నది. రూ.లక్ష లోపు రుణాలున్నా మాఫీ కాని రైతులు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. రెండో దశ రుణమాఫీ ప్రక్రియ మొదలైనా తమ విషయంలో ఎలాంటి స్పష్టత రావడం లేదని వీరు వాపోతున్నారు. బ్యాంకుల్లో, అధికారులను అడిగినా ఫలితం ఉండడం లేదని చెబుతున్నారు. సహకార సంఘాల్లో రుణమాఫీపై మరింత గందరగోళం నెలకొన్నది. పీఏసీఎస్‌ల వారీగా లబ్ధిదారుల జాబితాలు వచ్చినా వీరిలో చాలామంది అర్హుల పేర్లు లేవని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధన కారణంగానే తమకు రుణమాఫీ కావడం లేదని అంటున్నారు.

**భూపాలపల్లిలో కొందరికే మాఫీ**

జయశంకర్ భూపాలపల్లి, జూలై 30 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండో విడుత రుణమాఫీపై మళ్లీ అదే గందరగోళం నెలకొంది. లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు రెండో జాబితా కోసం ఎదురుచూడగా అందులో చాలామంది పేర్లు గల్లంతు కావడంతో ఇక చివరి జాబితాపైనే ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో రెండో విడుత మొత్తం 8,754మంది రైతులకు రూ.95,95,47,866 పంట రుణాలు మాఫీ కాగా, మొదటి విడుత రూ.లక్ష లోపు 16,502 మందికి రూ.85,00,12,230 మాఫీ అయ్యాయి. ఇంకా చాలామందికి రూ.లక్ష లోపు రుణాలు మాఫీ కావాల్సి ఉంది. అయితే లక్ష లోపు తీసుకున్నది ఎంతమంది? లక్షన్నర లోపు రుణం తీసుకున్నది ఎంతమంది అనే విషయమై బ్యాంకు అధికారులు, అటు వ్యవసాయ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు బ్యాంకులు, అధికారులు చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది.

### రైతుల్లేక వెలవెల



బయ్యారం : రైతులు లేక వెలవెలబోతున్న రైతు వేదిక

బయ్యారం, జూలై 30 : మహబూబాబాద్ జిల్లా కొత్తపేటలో రైతుల్లేక 'రైతుసంబురం' కార్యక్రమం వెలవెలబోయింది. మంగళవారం లక్షా యాభై వేల లోపు రుణమాఫీ విడుదల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించేందుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాల్సి ఉండగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో రైతువేదిక ఖాళీ కుర్చీలతో కనిపించింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పురుగుమందుల వ్యాపారులతో మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు వ్యవసాయ శాఖ అధికారులు.

### నిబంధనలే కారణమా ?

ప్రతి రైతుకు పంట రుణమాఫీ అని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అమలులో అడ్డగోలు నిబంధనలు విధించింది. ఫలితంగా ఎక్కువ మంది ఈ పథకానికి దూరమయ్యారు. మొదటి దశ రుణమాఫీ ప్రక్రియ మొదలైన ఈ నెల 18నుంచి వీరంతా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులను కలిసి తమ పరిస్థితిని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు, అప్పుడు అవుతుందని అధికారులు వీరికి మాటలు చెప్పి వాయిదాలు వేస్తూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ రుణమాఫీని మొదలుపెట్టినట్లు ప్రకటించడంతో మొదటి దశ ప్రక్రియలో తమ పేర్లు ఇక ఉండే అవకాశం లేదని వీరు వాపోతున్నారు. రూ.లక్ష లోపు రుణాలను పూర్తిగా మాఫీ చేయని ప్రభుత్వం ఇప్పుడు రెండో దశ పేరుతో మరింత మంది రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి రైతుకు పంట రుణాలు మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికే మాఫీ చేస్తున్నది. రేషన్‌కార్డు ప్రాతిపదికగా కుటుంబంలో ఒక్కరికే లోను మాఫీ చేస్తామనే నిబంధనతో అర్హులు చాలామంది లబ్ధిదారుల జాబితాలో లేకుండా పోయారు. ప్రభుత్వం నిబంధనలు పెట్టినా అర్హులకు రుణాలు మాఫీ కావడం లేదని, ఈ విషయం చెప్పుకుందామంటే ఎవరిని కలువాలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మాఫీ కోసం వ్యవసాయ అధికారులు తయారు చేసిన జాబితాల్లో తమ పేరు ఉన్నా, రుణాలు మాఫీపై బ్యాంకుల నుంచి, ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని చాలా మంది రైతులు వాపోతున్నారు. పంట రుణాల మాఫీ లబ్ధిదారుల వివరాలు చెప్పేలా కచ్చితమైన జాబితాలు గ్రామాల్లో ఎక్కడా అందుబాటులో ఉండడం లేదని, దీంతో బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని చెబుతున్నారు.

### నా పేరు లేదు



నర్సింహులపేట : నా పేరున డీసీసీ బ్యాంకులో రూ. 50 వేలు రుణం తీసుకున్న. అప్పుడు బ్యాంకు వాళ్లు నాకు రూ. 44 వేలు ఇచ్చి ఆరు వేలు షేర్ అమౌంట్ అని ఉంచుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రెండు సార్లు మాఫీ చేసినా నా పేరైతే రాలేదు. పీఏసీఎస్ ఆఫీస్‌కు ఎన్నిసార్లు పోయినా ఏమీ చెప్పడం లేదు. మా ఊళ్లో చాలా మందికి మాఫీ అయింది కానీ నాకు మాత్రమే కాలేదు. వ్యవసాధికారులు మాత్రం నా పేరు పైకి పంపలేదని చెబుతున్నారు. బ్యాంకుకు పోతే అగ వస్తది. ఇగ వస్తది అంటున్నారు. ఇప్పటికైనా పెద్ద సార్లు జర నాకు రుణమాఫీ వచ్చేలా చేయండి.

– జేరిపోతుల రమేశ్, కొమ్ములవంచ

# మానుకోటలో జోరు వాన

- ఉధృతంగా పారుతున్న వాగులు, వంకలు
- జలదిగ్బంధంలో ఏజెన్సీ ప్రాంతం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

## కొత్తగూడ, గంగారంలో 10 సెం.మీ వర్షపాతం



గంగారం : ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

కొత్తగూడ/గంగారం/బయ్యారం/గార్ల, జూలై 30 : మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాటు పలు చెరువులు మత్తడి దుంకాయి. ఏజెన్సీ ప్రాంతం జల దిగ్బంధంలో చిక్కుకోగా, పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొత్తగూడ, గంగారం మండలాల్లో అత్యధికంగా 10.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడ–నర్సంపేట ప్రధాన రహదారిలోని గాదెవాగు, గుంజేడు వాగులు, ఇల్లందు–కొత్తగూడ మధ్యలోని బూర్కపల్లి, కొత్తగూడ–కొత్తపల్లి మధ్యలోని వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలువురు ఉపాధ్యాయులు వాగులు దాటి పాఠశాలలకు వెళ్లారు. ప్రజలు వాగులు దాటకుండా అధికారులు ట్రాక్టర్లను అడ్డుపెట్టారు. బయ్యారం మండలంలోని వట్టివాగు, పందిపంపుల, మశి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మశివాగు నీరు రహదారి పైకి చేరడంతో కంబాలపల్లి, లక్ష్మీపురం, మిర్యాలపెంట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గంగారం మండలంలో వరద తాకిడికి మక్కజొన్న పంట నేలవాలింది. జంగాలపల్లి తండాకు చెందిన అజ్మీరా శాంతి ఇంట్లోకి వర్షపు నీరు చేరి వస్తువులు తడిసిపోయాయి. బయ్యారం పెద్ద చెరువు మత్తడి పడుతుండగా, తులారం ప్రాజెక్ట్, గౌరారం, వట్టివాగు కట్టు, పెద్ద గుట్టపై పాండవుల, చింతోనిగుంపులోని వంకమడుగు జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గార్ల మండలంలోని పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రాంపురం శివారులోని చెక్‌డ్యాం నిండడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక సీఐ రవి కుమార్, ఎస్సై జీనత్ కుమార్ చెక్‌డ్యాం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలువరించారు.



గార్ల : చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న పాకాల ఏరు

కొత్తగూడ : కొత్తపల్లి శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గాదె వాగు



గంగారం : వరద తాకిడికి నేలమట్టమైన మక్క జొన్న పంట

# నకిలీ వైద్యులు.. అనుమతి లేని క్లినిక్‌లు

- ఐదుగురిపై కేసు నమోదు
- టీజీఎంసీ ఫిర్యాదుతో వెలుగులోకి..

సుబేదారి, జూలై 30: అనుమతి లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఐదుగురు నకిలీ వైద్యులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్య మండలి ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హనుమకొండ రాంనగర్‌లో గాయత్రి క్లినిక్ నిర్వాహకుడు ఏ లకపతి, రాయపుర ఇందిరానగర్‌లోని శ్రీరాజరాజేశ్వరి క్లినిక్ నడిపిస్తున్న బత్తుల రాజ్‌కుమార్, రెడ్డికాలనీలోని వెంకటేశ్వర క్లినిక్ నిర్వహిస్తున్న ఫార్మాసిస్టు, శ్రీశ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు సీహెచ్ భాస్కర్‌పై ఐపీసీ 417,420, 22టీఎంపీఆర్, 34, 54 ఎన్ఎంసీ ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డాక్టర్లుగా చెలామణి అవుతూ వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే నకిలీ వైద్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ హెచ్చరించారు. వరంగల్ నగరంలో మరికొంతమంది నకిలీ వైద్యులు ఉన్నారని, వారిపై కూడా త్వరలో కేసులు పెడుతామని టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు.



ఇల్లందలో మత్స్యకారుడికి దొరికిన మలుగుబేను

## ఆకేరు వాగులో అరుదైన చేప

వర్ధన్నపేట, జూలై 30 : ఆకేరు వాగు ఇల్లంద గ్రామానికి చెందిన మత్సకారుడి వలకు మంగళవారం అరుదైన చేప చిక్కింది. కొర్రమీను ఆకారంలో ఉండి పాములా పొడవుగా ఉండడంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. చేపను ఇంటికి తీసుకెళ్లగా పలువురు ఆసక్తిగా పరిశీలించారు. దీనిని కొర్రమీను జాతికి చెందిన మలుగుబేను అంటారని మత్స్యకారులు చెబుతున్నారు.

## కమ్ముకున్న మేఘం.. అద్భుతం ఆవిష్కృతం



చుట్టూ పచ్చని పొలాలతో ఉన్న ఈ గుట్టలను మేఘాలు ఆవిరించిన దృశ్యాలు చూపరులను అచ్చెరువొందిస్తున్నాయి. మంగళ వారం ఉదయం చిరు జల్లులు తుంపర వలె కురుస్తున్న వేళ పచ్చని గుట్ట వద్ద ప్రకృతి రమణీయ చిత్రం ఆవిష్కృతమైంది. ఇది అద్భుతం బయ్యారం మండలంలోని ఏజెన్సీ గ్రామంలోని పెద్దగుట్ట వద్ద కనిపించింది. - బయ్యారం, జూలై 30



